# మనసున్న మనిషి

అంతకు ముందువరకూ కళ కళలాడే ఆ యింటి ముంగిలి ఒక్కసారి మరు భూమిలా మారిపోయి కళాహీనమైపోయింది. పెంకులూడి రాలిపోతూ సగటు మధ్య తరగతి కుటుంబానికి ప్రతీకగా నిల్చిన ఆ యింటివాకిట్లో తులసమ్మ అచేతనంగా ఉంది-

తులసమ్మ చచ్చిపోయింది!

సహనంలో భూదేవిలాంటి ఆ యింటి ఇల్లాలు ఆఖరి శ్వాస పీల్చి అప్పటికి అరు గంటలైంది- జీవితంలో ఎదురైన అన్ని కష్టాలూ, సమస్యలూ తీరిపోయినట్టు ప్రశాంతంగా వుందామె వదనం

ఆమెకి కాస్త దూరంలో నిల్చున్న ఐదేళ్ల వాసు, మూడేళ్ల జానకి జరిగిందేమిటో అర్థంకాక తల్లిముఖంలోకి భయం భయంగా చూస్తున్నారు-

పిల్లల వంక ఒక్కసారి చూశాడు సాంబశివం- "తనలాగే వీళ్లూ పసితనంలోనే తల్లి ప్రేమను పోగొట్టుకున్న దౌర్భాగ్యులు" అనుకున్నాడు- తల్లి లేక పోయినా వీళ్లకి తనున్నాడు- అయినా ఏం లాభం? ఈ బీద తండ్రి వాళ్లకేమివ్వ గలడు? పిల్లల భవిష్యత్తును తల్చుకుంటే అతని కళ్ళలో నీళ్లు తిరిగాయి-

నందివర్ధనం చెట్టుక్రింద అరుగుమీద కూర్చున్న సుబ్బాయమ్మగారు తమ్ముడి ముఖంలోని బాధను గుర్తించింది- ఆమె కాక్షణంలో సాంబశివం మీద జాలికలిగింది- జీవితమంతా ఆర్థికపరమైన యిబ్బందుల మధ్యా, తెగని చిక్కు సమస్యల మధ్యా బ్రతికిన సాం బశివం ఏం సుఖపడ్డాడనీ?

పాతికేళ్ల వయసులో సాంబశివానికి అనసూయతో పెళ్లి జరిగింది- అయితే ఆమెతో అట్టేకాలం కాపరం చేసే గీత సాంబశివానికి లేకపోయింది- తన వైవాహిక జీవితం గురించి ఎన్నో కలలు గన్న అనసూయ తన భర్త ఓ సామాన్య వ్యవసాయదారుడు కావటం భరించలేక పోయింది- కోర్కెలు ఆమె జీవితాన్ని పెడదార్న పట్టించాయి. సాంబశివాన్ని ఒంటర్ని చేశాయి- మళ్లీ పదిహేను సంవత్సరాలకి తను పట్టుబట్టి యీ సంబంధం చేసింది- పేదింటి పిల్లే అయినా తులసి లక్షణమైన పిల్ల- ఇద్దరు పిల్లల్ని కని, మూడో పిల్లని అతి కష్టంమీద లోకంమీదికి తెచ్చి తను లోకం వదిలింది తులసమ్మ- మళ్లీ సాంబశివం తోడులేని పక్షి అయ్యేడు-

సుబ్బాయమ్మగారి కళ్లలోనూ, నీటి పొర జేరింది-

పిల్లలిద్దరూ ఆమెకు యిరువైపులా చేరి చెరో చేతినీ పట్టుకుని కూర్చున్నారు-

తదుపరి కార్యక్రమాలకోసం సాంబ శివం బయటకు నడిచేడు. ఇరుగుపొరుగు వారూ, తెల్సినవారూ, బంధువులూ ఒకరూ ఒకరూ చేరుతున్నారు-

అక్కడ దుఃఖం నిశ్శబ్దంగా ఘనీభవించి వుంది- ఆ నిశ్శబ్దాన్ని చీలుస్తూ లోపల్నుంచి పసిబిడ్డ ఏడుపు వినిపించింది. సుబ్బాయమ్మగారు లేచి లోపలకు నడిచారు- ఆమె వెనుకే పిల్లలిద్దరూ-

"ముగ్గురు బిడ్డల్నీ తల్లిలేని వాళ్లని చేసి వెళ్లిపోయింది తులసమ్మ- ఎంత ఘోరం-" అన్నారెవరో-

"బతికుండి మాత్రం ఆ తల్లి ఏం సుఖపడిందనీ-"

"పాపం! ఆ పిల్లల్ని చూస్తే జాలేస్తోంది- కూచుంటే లేవలేక, లేస్తే కూర్చోలేని స్థితి ఆ ముసలమ్మ గారిది- ఆయన మాత్రం పసికందుల్ని ఎలా పెంచుతాడూ? కష్టమే."

నలుగురూ నాలుగు రకాలుగా సానుభూతిని ప్రకటిస్తున్నారు.

**ఆదూరి వెంకట సీతారామమూర్తి**

సుబ్బాయమ్మగారు వచ్చి మళ్ళీ అరుగుమీద కూలబడింది. డెబ్బయ్ యేళ్ళుంటాయామెకు- ముప్పయ్ ఏళ్ళ వయసులోనే తల చెడి అత్తవారి తరఫున నా అన్న వారెవరూ లేని స్థితిలో తమ్ముడి పంచకు చేరింది- ఆమెకు కొద్దిపాటి భూమి ఉంది. అది ఆమె జీవనోపాధికి మాత్రం సరిపోతుంది-

బ్రాహ్మడిని తీసుకొచ్చేడు సాంబశివం- వెదురు బొంగులూ, తాళ్ళూ తదితర సామగ్రి వచ్చేయి-

పట్నం నించి తులసమ్మ తమ్ముడు ప్రకాశం; నలభై మైళ్ళు దూరంలోని పల్లె నుంచి తులసమ్మ అన్న సూర్నారాయణ వచ్చేరు- ఇంకా దగ్గర, దూరం బంధువులెవరెవరో వచ్చారు-

అవరణంతా జనంతో నిండిపోయింది- చాలా మందిలో దుఃఖం సానుభూతి మనసుల్లోనే ఉండిపోయాయి- కొందరవి బహిర్గతం చేస్తున్నారు-

"నాకీ సంబంధం యిష్టమే అంటూ చేసుకుని యిలా సుఖపడి పోయావా తల్లీ-" అంటూ రాగాలుతీస్తోంది తులసమ్మ వదిన గారు- ఎందుకో వాళ్ళ దుఃఖంలో ఏడుపుల్లో కృత్రిమత్వమే కన్పించింది సాంబశివానికి-

ఎంత అవసర మొచ్చినా ఒక్కనాడు పుట్టింటి గడప తొక్కలేదు తులసమ్మ- వీళ్ళ ప్రేమాభిమానాలు ఆమెకు తెలియనివి కావు- అటువంటి వీళ్ళేనా యిలా ఏడుస్తున్నది? ఆ వంచన, ఆ ఏడుపులూ ఎందుకో అర్థం కాలేదు సాంబశివానికి-

మరదల్ని చివరిసారిగా చూసి వెనుదిరిగేరు సుబ్బాయమ్మగారు-అంతవరకూ నిబ్బరంగానే వున్నారావిడ-ఆ తర్వాత చాతకాలేదు-కళ్ళలోంచి నీరు ధారాపాతంగా కారిపోయింది.

"చిన్నపిల్ల, ముచ్చటైన సంసారం- పసికందులు-ఇన్నేళ్ళొచ్చేయి-నేనెవరికి ఉపయోగం- నన్ను తీసుకుపోరాదూ ఆ భగవంతుడు-" అనుకుందావిడ-కళ్ళుతుడుచుకుంటూన్న సుబ్బాయమ్మగారికి దూరంగా బీరపాదు ప్రక్కన కదిలిన అకారం కన్పిం

చింది-ఆ ఆకారం పేరు సరస!

ఒక్కక్షణం ఆశ్చర్యపోయేరు సుబ్బాయమ్మగారు-అవును-ఎన్నేళ్ళకు? ఏడేళ్ళ క్రితం తనే ఆజ్ఞాపించింది సరసను యీ యింటి ఛాయలకు రావద్దని-అప్పటికిప్పుడు- ముందుకు రాలేక, పూర్తిగా రావడం మానుకోలేక వచ్చి చాటుగా తమ కష్టాల్లో పాలుపంచుకుంటోంది.

అప్రయత్నంగా తమ్ముడివంక చూశావిడ-సాంబశివం కూడా సరిగ్గా అదే సమయంలో సరసను చూసి అక్కగారి వంక చూశాడు. అతని కళ్ళు ఏ భావాన్నీ పలికించలేని నిస్సహాయతలో వున్నాయి-

గుమ్మందాటి సవారీ శ్మశానం వైపు నడిచింది-

ఆ సాయంకాలానికే వచ్చిన వాళ్ళంతా వెళ్ళిపోయారు-

* * * * *

వార్త తెలిసిన బంధువులంతా పదో రోజుకి కుటుంబాలతో వచ్చారు-ఆ పదిరోజులూ పది యుగాలుగా గడిచాయి సుబ్బాయమ్మగారికి, సాంబశివానికీ-

"అమ్మ ఎక్కడకెళ్ళిందత్తయ్యా-నేనూ అక్కడికే వెళ్తాను" అని వాసు ఒకటే ఏడుపు -తల్లి కన్పించకపోయే సర్కి మూడో రోజుకే జానకి బెంగతో జ్వరం తెచ్చుకుంది-

వీళ్ళిద్దరికీ తోడు తల్లిపాలరుచి ఎరుగని పురిటికందు!

పొరుగువాళ్ళ సాయం చేయకపోతే సుబ్బాయమ్మగారు ఏమైపోయేవారో!


సాంబశివానికి యిటు భార్యపోయిన విచారంకంటే పదోరోజున జరిపించే తంతుకు కావల్సిన డబ్బు ఎలావస్తుందా అన్న విచారమే ఎక్కువైపోయింది-

మనిషి బ్రతికున్నంతవరకే ఏదైనా-అనుభవం, ప్రేమ, ఆకలి, దయ, సానుభూతి.... అన్నీ కట్టె సజీవంగా వున్నంత వరకే-ఆ తర్వాత ఎవరికెవరు? అర్థం లేని యీ తతంగమంతా ఎవరికోసం?

ఇలా ఎన్నో ఆలోచనలొచ్చేవి సాంబశివానికి-

ఒక్కోకప్పుడు యివన్నీ తనకు డబ్బు లేకపోవడం వల్లనే కలుగుతున్నాయా అన్పించేది-

మనసుకు నచ్చకపోయినా లోకంకోసం కొన్నిటికి లోబడి ప్రవర్తించక తప్పదు-



# మనసున్న మనిషి

పదోనాటి కార్యక్రమం యధావిధిగానే ముగిసింది-ఆ సాయంకాలం వచ్చిన బంధువులంతా వాకిట్లో తలోచోటా కూర్చుని కష్టాల్ని మర్చిపోయే కబుర్లేవో చెప్పుకుంటున్నారు- కాసేపు నిద్రపోయిలేచి వంటరిగా ఎటో వెళ్ళేడు సాంబశివం-లోకమెరుగని పసిపాప గదిలో నిద్రపోతోంది-

వడలిపోయిన పువ్వుల్లావున్న పిల్లల్ని తీసుకుని వాకిట్లోకొచ్చి అరుగుమీద కూర్చున్నారు సుబ్బాయమ్మగారు-ఇక్కడున్న బంధువుల్ని చూసేసర్కి యీ పదిరోజులుగా చెప్పాలని మనసులో మధనపడుతున్న విషయం బయట పెట్టడానికదే అనువైన సమయంగా తోచిందామెకు-

అయితే మామూలుగా చెప్పటానికది సామాన్యమైన విషయం కాదు-

ఎలాగైతేనేం ఒకటికి నాలుగు సార్లు మనసులోనే అనుకున్నాక అందరినీ దగ్గరకు పిలిచి విషయాన్ని వాళ్ళ ముందుంచారావిడ-'మీలో ఎవరైనా ఫర వాలేదు-అందరూ కావల్సినవాళ్ళే-ఎవరో ఒకరు పుణ్యం కట్టుకోండి' అని అర్ధించారు-

ఆమె నోటినుండి ఆమాట అంత సూటిగా వస్తుందని ఎవరూ అనుకోలేదు-అది విన్నాక ఎవరికివారికే అది సమస్యగా తోచింది-

తల్లిలేని ఆ పసిగుడ్డును ఎవరో ఒకరు కొన్నాళ్ళు సాకాలి-వీలైతే పెంచుకోవాలి-అలా చేస్తే తులసమ్మ ఆత్మ సంతోషిస్తుంది-దేవుడూ సంతోషిస్తాడు-

వెంటనే ఎవరూ ఏం మాట్లాడలేదు-ముఖాలు చూచుకున్నారు-

"ఉన్న కరిణీకం కూడా వూడిపోయింది-పసిదాన్ని సాకాలంటే మాటలా?" అనుకుంది తులసమ్మ వదినగారు-

"చేతిలో గవ్వలు ఆడినంతకాలం జల్సా చేశాడు-ఏదో కుదుటపడతాడని పిల్లనిచ్చేం- ఇప్పుడీ జంజాటన ఎవరు పడతారు" అనుకున్నారు తులసమ్మ అన్నగారు-

"ఎటూ పిల్లల్లేరని తెల్సి పెంచుకోకూడదా అని సూటిగా చెప్పలేక ముసలావిడ యీవిధంగా చెబుతోంది-కానీ పెంచుకుంటూ పెంచుకుంటూ ఆడపిల్లనా పెంచుకోవడం! అయినా తమకింకా వయసేం మించిపోయిందనీ" అనుకుంది తులసమ్మ మరదలు-

"అక్క ఆత్మశాంతికిది సరియైన పద్ధతేకావొచ్చు-కానీ కొన్నాళ్ళు పెంచి యిచ్చేయటం కుదరని పని - దత్తత చేసుకోవాలంటే సావిత్రి ఏమంటుందో" అనుకున్నాడు తులసమ్మ తమ్ముడు.

"బంధుత్వముంది కనుక ఏదో కష్టానికీ సుఖానికి వచ్చి చూడ్డం తప్ప యీ రోజుల్లో కూడ యిలా బాధ్యతల్ని నెత్తినేసుకోడం ఎవరితరం ? అన్నీ మధ్యతరగతి కుటుంబాలే ! ఎవరి సంసారం గురించి ఎవరి పిల్లల భవిష్యత్తు గురించి వాళ్ళే ఆలోచించుకోవాల్సిందే" అనుకున్నారు మిగతా బంధుజనం -

ఎవరికివారు మనసుల్లోనే యీ విధంగా అనుకుని వూరుకున్నారు.

"సాంబశివం నామాట తీసెయ్యడు-పెద్దపిల్లలెటూ వాడికి చేరువయ్యేరు కాబట్టి తప్పదు- వెళ్ళేలోగా ఎవరు ముందుకొచ్చినా సంతోషమే" అన్నారు సుబ్బాయమ్మగారే చివరి మాటగా-


నూతన యవ్వనం పొందండి! సంతానవంతులు కండి
చర్మవ్యాధులు నుండి విముక్తులు కండి!



హస్త ప్రయోగము వలన కలిగిన నరముల బలహీనత, అంగము చిన్నదగుట, అవసర కాలమందు అసంతృప్తి, దాంపత్య సుఖం లేకపోవుట, సంతానము లేకపోవుట, ఉబ్బసం, సోరియాసిన్ పొడలు, పరప, తెలుపు (బొల్లి), నలుపు, ఎరుపు మచ్చలు, రసిష్పుండ్లు, సుఖసంబంధమైన వ్యాధులు, ఫిస్టులా, మూలశంకలు, స్త్రీలకుసుమ వ్యాధులు, బ్లడ్‌ప్రషర్, పక్షవాతము, మేహపొడలు, సమస్త దీర్ఘ వ్యాధులకు, చర్మవ్యాధులకు ఆయుర్వేద చికిత్స, పోస్టు ద్వారా కూడ చికిత్స కలదు.

ప్రతినెల క్యాంపులు :-

ప్రతినెల క్యాంపులు:

రాజమండ్రి 1,16 తేదీలలో "అశోకాలాడ్జి", కోటగుమ్మం వద్ద.
కాకినాడ 2,17 తేదీలలో "వీనస్ A.C. లాడ్జి", కల్పనాటాకీస్ ఎదుట
భీమవరం: 3,18 తేదీలలో "షణ్ముఖ లాడ్జి"
ఒంగోలు: 9 వ తేదీ "హోటల్ పూర్ణిమ" A.C., బస్టాండ్ దగ్గర.
ఖమ్మం: 25 వ తేదీ "హోటల్ కిన్నెర" A.C., బస్‌స్టాండ్ దగ్గర.

Note: ప్రతికేంద్రంలో ఉ॥ 10-00 గం॥ నుండి రాత్రి 10-00 గం॥ వరకు. పైతేదీలు మినహా మిగిలిన దినములలో డాక్టరుగారు గుడివాడలోని క్లినిక్‌లో వుంటారు.

డా॥ డి. మార్కండేయులు
ఆయుర్వేదభిషక్, సెక్స్ & స్కిన్ స్పెషలిస్ట్
పార్కురోడ్, గుడివాడ-521301 * ఫోన్స్: 2522 & 2540.


## రచయితలకి సూచనలు

ఆంధ్ర సచిత్రవారపత్రికకి పరిశీలనార్థం తమ రచనలని పంపే వారు ఈ కింది సూచనలని గమనించ కోరుతున్నాము.

రచనలు కాగితానికి ఒక వైపే సిరాతో లేదా బాల్‌పెన్‌తో రాయాలి. కాగితానికి రెండు వైపులా రాసి ఉన్న రచనలని పరిశీలించటం జరగదు

పరిశీలనకి పంపే రచనలు కథలైతే 10 అరఠావు పేజీలకి మించకుండా ఉంటే మంచిది. వ్యాసాలు 3 అరఠావు పేజీలు మించరాదు. వ్యాసాలు పంపేవారు వాటికి సంబంధించిన బొమ్మలు లేదా ఫొటోలు జతపరిచి పంపటం అవసరం.

రచనలు స్వంత రచనలై ఉండాలి. అనువాదాలు, అనుసరణలు, కాపీ రచనలు పంపరాదు. ఆ మేరకి రచయిత(త్రి) హామీ పత్రం రాసి సంతకం చేసి రచనతో పాటే పంపాలి.

రచనలు పూర్తిగా తెలుగు లిపిలోనే రాసి ఉండాలి. వ్రాత ప్రతి మీద రచయిత(త్రి) పూర్తి చిరునామా స్పష్టంగా పిన్‌కోడ్‌తో సహా రాయాలి.

కథల పరిశీలనకి 1–2 నెలలు, నవలల పరిశీలనకి కనీసం 6 నెలలు పట్టవచ్చును. పరిశీలన అయిన తర్వాత ఏ విషయం అయ్యా రచయిత(త్రు)లకి తెలియచేయటం జరుగుతుంది. ప్రచురణకి స్వీకరించని రచనలని తిప్పి పంపకోరేవారు తమ రచనతో పాటే స్వంత చిరునామా కల, తగినన్ని తపాలా బిళ్ళలు అతికించిన కవరు జత పరచి పంపాలి. లేకపోతే వాటిని తిప్పి పంపటం సాధ్యం కాదు. రచనలు తిప్పి పంపే విషయంలో తగిన జాగ్రత్త తీసుకోటం జరుగుతుంది కానీ పోస్టులో పోయే వాటి విషయంలో మేము బాధ్యతని స్వీకరించలేము. వాటిపై ఎటువంటి ఉత్తర ప్రత్యుత్తరాలకీ అవకాశం లేదు.

రచనలు పంపిన వారు తమ చిరునామా మారిన సందర్భంలో వెంటనే ఆ విషయాన్ని మా కార్యాలయానికి తెలియ చేస్తూ ఒక కార్డు రాయటం అవసరం.

ఉత్తరాలు, తదితర పాఠకుల శీర్షికలకి రాసే వారు కూడా తమ పేరు, పూర్తి చిరునామా ఇవ్వాలి. రచనలు పూర్తిగా తెలుగు లిపిలోనే ఉండాలి. లేకపోతే వాటిని పరిశీలించటం జరగదు.

పరిశీలనకి పంపే రచనలని "సంపాదకుడు, ఆంధ్ర సచిత్రవారపత్రిక, గాంధీనగరం, విజయవాడ – 520003" అనే చిరునామాకి పంపాలి. కవరు పైభాగంలో శీర్షిక పేరు రాయటం మంచిది. – సంపాదకుడు

అయితే ఆ రాత్రి ఎవరూ సరిగా నిద్రపోలేదు - ఆ మర్నాడంతా సుబ్బాయమ్మగార్ని తప్పించుకునే తిరిగారు - వెళ్ళేరోజు ఆమె ఎదుట పడకుండానే ఒకరూ ఒకరూ వెళ్ళిపోయారు.

అందరూ వెళ్ళిపోయారని నిర్ధారించుకున్నాక బరువైన నిట్టూర్పు విడిచి వీధి గుమ్మంలోకొచ్చారు సుబ్బాయమ్మగారు.

అవును - ఎవరి పిల్లలను గురించి వాళ్ళు ఆలోచించుకోవాల్సిందే- అనురాగాలూ అభిమానాలూ వున్నా మనిషి మనుగడకు కావల్సింది డబ్బేకదా -

అలికిడైతే తలెత్తి చూసేరావిడ.

గుమ్మంలో సరస !

అసలే బంగారుఛాయ - వీసమెత్తు కూడ వన్నె తగ్గలేదు - మనిషి బలంగా ఆరోగ్యంగా వుంది.

"నువ్వా సరసా - అలా కూర్చో"

గుమ్మంలో ఒక మెట్టు దిగువన కూర్చుంది సరస - ఓ క్షణం సంశయించేక నోరు పెగుల్చుకుంది.

"బాబుగారికి పెద్ద ఆపదే ఒచ్చిందమ్మా - ఆ లోటు పూడ్చలేనిది - మ్మా లక్ష్మిలాంటి తల్లి... ముత్యాల్లాంటి పిల్లలు - విషపురుగుకు కూడా అన్యాయం చెయ్యని బాబుగారికి ఎంత అన్యాయం చేశాడా పరమాత్ముడు ?"

సుబ్బాయమ్మగారేం మాట్లాడలేదు - పదిరోజుల్నించీ వింటున్న సానుభూతి మాటలే అవి - సానుభూతి మాటలు జీవితాల్ని చక్కదిద్దలేవు - దుఃఖాన్ని, లోటుని దూరం చేయనూలేవు-

ఆవిడ ఆలోచనలన్నీ పరిపరివిధాల పోతున్నాయి.

"నాదో చిన్న మాటమ్మగోరూ - బాబుగారితో చెప్పడానికి నోర్రాదు- తమరు దయతలిస్తే..."

ఏమిటన్నట్లుగా సరసవంక చూశారు సుబ్బాయమ్మగారు-

"మరేం లేదమ్మా ఒకప్పటి నా పరిస్థితి గుర్తుకొస్తోంది- రెండు చేతులా సంపాదించే యజమాని అర్థాంతరంగా కాలం చేస్తే పసిబిడ్డడితో దిక్కులేనిదాన్నయిపోయేను - ఆ స్థితిలో ఆస్తులకంటే అప్పులే ఎక్కువనిపించి ఆ తగువులువడే తెలివీ, ఓపికా లేక ఆస్తుల్ని అయినకాడికి అమ్మేద్దామనుకున్న సమయంలో బాబుగారు దేవుడిలా వచ్చి నన్నూ నా బిడ్డనీ ఆదుకున్నారు - తగువులు తీర్చి ఆస్తి పోగొట్టుకోకుండా అప్పులు తీర్చే సులువులు చెప్పేరు - ఆనాడు బాబుగారే ఆదుకోకపోతే యీనాడీ సరసమీ ఎదుట వుండేదే కాదమ్మగారూ - అటువంటి బాబుగారికీ రోజు కష్టం కలిగితే ఆదుకోలేకపోవడం న్యాయం కాదమ్మగారూ- పాపని నాకిప్పించడమ్మా - నేను పెంచుకుంటాను - మా యింటికి లక్ష్మిందేవే వచ్చిందనుకుంటాను."

ఆశ్చర్యంగా సరసవంక చూశారు సుబ్బాయమ్మగారు - సరస కళ్ళలో కృతజ్ఞతాభావం వుట్టిపడుతోంది.

"మీ దయవల్ల అప్పూ, గేదెవున్నాయి - పాప పాలకి లోటుండదు. సుచీ సుబ్రంకూడ అలవడ్డాయి - అయినా అమ్మా నేను తక్కువ కులందాన్ననేగా మీ సందేహం ? అవునమ్మా అవును - నామూలంగా బాబుగారికీ, మీ కుటుంబానికీ మాటొచ్చింది - అది అప్పటి నా వయసువల్లే వచ్చిందో, బాబుగారి పరిస్థితివల్లే వచ్చిందోగాని, అది తప్పుడు మాటమ్మా - మామధ్య ఏ సంబంధమూలేదు. అది మీకు తెల్సు - ఆ భగవంతుడికీ తెల్సు - అయినా మీరు పెద్దోరు - మీ మాటను గౌరవించి యిన్నేళ్ళూ మీ ఎదటపళ్లేదు - కానీ నట్టింట దీపం పెట్టి బాబుగారి పేరు తల్చుకోని రోజు లేదంటే నమ్మండమ్మా - బాబుగారి కష్టం తీర్చలేనిది - పాపని తీసుకెళ్ళి పెంచుకోడం నా అదృష్టంగా భావిస్తాను- కళ్ళలో పెట్టుకొని పెంచుకుంటాను. దేవుడి బిడ్డలా చూసుకుంటాను. మీరెప్పుడు కోరితే అప్పుడు..."

సరస మాటలిక వినిపించడం మానేశాయి సుబ్బాయమ్మగారికి - మూర్తీభవించిన మానవత్వం ఎదుట నిలిచినట్లనిపించింది. మనుష్యుల్ని విడదీసే కులంకన్నా మనసులకి దగ్గరయ్యే గుణమే గొప్పదనిపించిందామెకా క్షణాన ! ●



## సంసార తాపత్రయం



శ్రీదేవితో వ్యవహారం బెడిసికొట్టినప్పటి నుంచి మిథున్ చక్రవర్తి తనేమిటో... తన సంసార మేమిటో అన్నట్లు వుంటున్నాడుట.

తన భార్యా పిల్లల్ని తీసుకుని సరదాగా ఈమధ్య కలకత్తాలో ఫుట్‌బాల్ ఆట చూసేందుకు వెళ్లాడట. ఆట చూసేవాడు చూడకుండా ఆ పోటీలో ఉత్తమ క్రీడాకారు లిద్దరికి పదివేల రూపాయలు బహుమతి ప్రకటించాడట. తన పరపతిని ఫుట్‌బాల్ స్టేడియం వరకే పరిమితం చేయకుండా కలకత్తా ఆస్పత్రిలో నెలకొల్పబోతున్న మూత్రపిండాల మార్పిడి విభాగానికి 30 లక్షల రూపాయలు విరాళంగా యిస్తానని వాగ్దానం చేశాడట. రక్తి మార్గం అయిపోయి, ముక్తి మార్గంలో పడ్తున్నాడు అంటున్నారు చాలామంది. మరి అనరూ?